క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ స్వగృహంలో 200 మంది వివిధ పార్టీల కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి జిల్లా మాజీ సర్పంచ్ కారుకొండ మాలోత్ బలరాం, స్టీవెన్ లాజరస్, గణేష్, వెంకన్న, రవి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

మంత్రి సమక్షంలో...
కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాస్‌రెడ్డిని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేయాలన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంతకముందు పలుశాఖల ప్రగతి నివేదికలను సమీక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీటీసీలు ఏఓ ఎస్ రఘుదీపిక, విద్యుత్‌శాఖ ఏఈ సతీష్, మిషన్ భగీరథ(ఇంట్రావిలేజ్) డీఈ శివయ్య, ఇరిగేషన్ ఏఈ మీనా, పశువైద్యాధికారి బద్దూలాల్, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణ రాజు, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, అటవీశాఖ డీఆర్‌ఓ లక్ష్మీనర్సు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం లక్ష్మీ, నాగమణి, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం..

సింగరేణి(కొత్తగూడెం): 138వ మే డే సందర్భంగా మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.విశ్వనాథం కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ప్రపంచ కార్మికవర్గం 138 ఏళ్ల క్రితం 8 గంటల పనిదినంతోపాటు అనేక హక్కులను సాధించుకుందని, వాటిని రద్దు చేసి 12 గంటల పనివిధానాన్ని అమల్లోకి తేవాలని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారత కార్మికవర్గానికి నేడు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు కార్మిక వ్యతిరేక ప్రజా, వ్యతిరేక విధానాలు ప్రమాదకరంగా ఉన్నాయని దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇల్లెందురూరల్: మోదీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు శపథం పూరించి 138వ మేడే జరపాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రావూరి ఉపేందర్ పిలుపునిచ్చారు. బొజ్జాయిగూడెం గ్రామంలో మేడే ప్రచార పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రమేష్, అబ్బయ్య, వీరయ్య, వెంకటేష్, సందీప్, కోటేష్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై 138వ మేడే సందర్భంగా పోరాటం ప్రతిన పూనాలని కార్మిక వర్గానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు భూక్యా హర్య పిలుపునిచ్చారు. మంగళవారం బద్దుతండాలో మేడే వేడుకల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నర్సింగ్, కిర్యా, బాదవత్ ఈర్య, హరిసింగ్, జబ్బార్ లాల్, లింబా, పడిత్య, రావుజ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటుదాం..


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కవిత

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత పిలుపునిచ్చారు. సుభాష్‌నగర్‌లో మంగళవారం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సుదీర్ఘ ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిపెట్టిన సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పరిపాలన అందించారని గుర్తుచేశారు. సాధ్యం కాని హామీలు, గారడీ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన అసమర్థ పాలనతో రాష్ట్రాని అస్తవ్యస్తం చేస్తోందని ఆరోపించారు. సాధించుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, దిండిగల రాజేందర్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవిద్య స్కూల్ సీఈఓ చైతన్య కృష్ణ


త్రివేణి పాఠశాలలో విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం


సెయింట్ జోసెఫ్ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి

‘పది’ విద్యార్థుల హవా

- ప్రైవేటు పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు
- 10జీపీఏ సాధించిన పలువురు విద్యార్థులు

పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్ష ఫలితాలు మంగళవారం ప్రకటించారు. కాగా.. పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను పాఠశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

– సాక్షి నెట్‌వర్క్

శ్రీవిద్య విజయకేతనం

కొత్తగూడెంరూరల్: పది ఫలితాలలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ విద్య స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ముగ్గురు 10/10 జీపీఏ సాధించారు. 13 మందికి 9.8 జీపీఏ వచ్చింది. 52 మంది విద్యార్థులు 9.0 పైగా జీపీఏ సాధించారు. విద్యా సంస్థల సీఈఓ మేదరమెట్ల చైతన్య కృష్ణ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుతోపాటు, వారి తల్లిదండ్రులు సహకారంతో రాణించారని తెలిపారు.

త్రివేణి విజయభేరి..

లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో విజయభేరి మోగించారు. 71 మంది 10 జీపీఏ సాధించారు. 149 మంది 9.8 జీపీఏ, 538 మంది 9.0 జీపీఏ సాధించారు. కొత్తగూడెంలోని త్రివేణి హైస్కూల్‌లో 11 మంది 10/10, 23 మంది 9.8జీపీఏ, 94 మంది 9.7 జీపీఏ, 94 మంది 9.0 జీపీఏ, 22 మంది 8.0 జీపీఏ సాధించారని డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ తెలిపారు.

సెయింట్ జోసఫ్ విజయబావుటా

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం ధన్‌బాద్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో 79 మందికి 79 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో ఏడుగురు 10/10 జీపీఏ సాధించగా, మిగిలిన వారు 9.8 – 6.0 జీపీఏ వరకు సాధించారని ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ జార్జిరెడ్డి తెలిపారు.

సింగరేణిలో ఉత్తమ ఫలితాలు...

మంగళవారం విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో సింగరేణి పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో 94 శాతం, తెలుగు మీడియంలో 78 శాతం ఫలితాలు వచ్చాయి. తెలుగు మీడియంలో 55 మంది విద్యార్థులకు గాను 43 మంది ఉతీరత సాధించగా, 12 మంది ఫెయిలై 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 462 మందికి 432 మంది పాసై, 30 మంది ఫెయిలై 98 శాతం ఉత్తీర్ణత సాధించారు.

శ్రీచైతన్య విద్యార్థులల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు టాప్‌లో దూసుకపోయారు. ఆరుగురు 10/10, నలుగురు 9.8, 10 మంది 9.7, ఆరుగురు 9.5 జీపీఏ సాధించారు. 99శాతం ఉత్తీర్ణతతో పట్టణంలోనే మొదటి స్థానంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నిలబడిందని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు.

సాటిలేని శ్రీరాగా స్కూల్..

కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగా స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. విద్యార్థులను కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ అభినందించారు. డైరెక్టర్ మల్లారపు కవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌ఆర్ డీజీ సక్సెస్..

ఎస్‌ఆర్ డీజీ కొత్తగూడెం విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సక్సెస్ సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఐదుగురు10 జీపీఏ, 12 మంది 9.8 జీపీఏ, 12 మంది 9.7 జీపీఏ, ఏడుగురు 9.5 జీపీఏ, 66 మంది 9 జీపీఏ సాధించారని తెలిపారు.

నారాయణ స్కూల్ సత్తా..

పాల్వంచ: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో స్థానిక నెహ్రూనగర్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. బీడెం వెంకటశివ భరద్వాజ్ 9.7, తన్నీరు నిశాంత్ బాబు 9.5, కటుకోజ్వల ఆర్య 9.2, తాళ్లూరి బ్యూల, బత్తుల యశ్వంత్ సింహారెడ్డి 9.0 సాధించారు.

త్రివేణి విద్యార్థుల విజయకేతనం

పది ఫలితాల్లో పాల్వంచలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు విజయ కేతనం ఎగురు వేసారు. బి.వేద హర్షిణి, జి.హాసిని 10 పాయింట్లు సాధించారు. 9.8 పాయింట్లు 9 మంది సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.రామ్మూర్తి అభినందించారు.


పాల్వంచ: విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి పాఠశాల యాజమాన్యం



కొత్తగూడెంఅర్బన్: శ్రీరాగాలో ఉపాధ్యాయులతో విద్యార్థుల సంబురం


శ్రీచైతన్యలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


కె.సవీన్ తేజ, పాపకొల్లు హైస్కూల్ | జి.నవ్య, | ఎ.నైనిషా పడమటనర్సాపురం | కె.ప్రేమిక, జూలూరుపాడు | తేజశ్విని, కాకర్ల హైస్కూల్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు పదో తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. మేదరబస్తీలోని శ్రీరాగా స్కూల్ విద్యార్థులు 9.7, 9.5 జీపీఏ సాధించారు. ఎస్సార్ డీజీ కొత్తగూడెం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. చైర్మన్ ఎ.వరదారెడ్డి విద్యార్థులను అభినందించారు.

జూలూరుపాడు: మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. పాపకొల్లు, జూలూరుపాడు, గుండెపుడి, కాకర్ల, పడమటనర్సాపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన 326 మందికి 272 మంది ఉత్తీర్ణులయ్యారు. 83.4 శాతం ఉత్తీర్ణత సాధించారు.

టేకులపల్లి: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేకత చాటుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి ఠాకూర్ రాంసింగ్ తెలిపిన వివరాలు... గంగారం ఆశ్రమ పాఠశాల, బోడు జెడ్పీ హైస్కూల్, సులానగర్ జెడ్పీ హైస్కూల్, బొమ్మనపల్లి జెడ్పీ హైస్కూల్, బాలురు గురుకులం వంద శాతం ఫలితాలు సాధించాయి. మండలంలో మొత్తం 442 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 403 మంది ఉత్తీర్ణులై 91.17 శాతం సాధించినట్లు చెప్పారు. బాలికల గురుకులం విద్యార్థులు పోగు యశశ్రీ 9.8, తాత సమత 9.7, లింగమర్ల సిరి లీల 9.5, టేకులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మోతుకూరి మనస్విని 9.5, భూక్యా లిఖిత్ కుమార్ 9.2, మల్లు లావణ్య 9, మామిళ్లపల్లి దివ్యశ్రీ 9 జీపీఏ సాధించారు.


యశశ్రీ | తాత సమత | సిరిలీల | మనస్విని | లిఖిత్ కుమార్ | లావణ్య | దివ్యశ్రీ

వంద శాతం ఉత్తీర్ణత..

ఇల్లెందు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 47 మందికి 47 మంది ఉత్తీర్ణులయ్యారు. మైనార్టీ గురుకులం విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించటం పట్ల జిల్లా మైనార్టీ శాఖ అధికారి సంజీవరావు, రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ అరుణ కుమారి, విజిలెన్స్ అధికారులు అఫ్రోజ్, ప్రిన్సిపాల్ కృష్ణ విద్యార్థులను అభినందించారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో...
ఇల్లెందు ఏటీడీఓ పరిధిలో 527మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 481 మంది ఉత్తీర్ణులయ్యారు. మామకన్ను, శంభునిగూడెం, ఇల్లెందు, గుండాల ఎస్టీ బాలుర, గంగారం, ఆనంతోగు, మర్కోడు అత్యుత్తమ ఫలితాలు సాధించగా ఏటీడీఓ పరిధిలో 91శాతం ఉత్తీర్ణత సాధించనట్లు ఏటీడీఓ రూపాదేవి తెలిపారు.

సుదిమళ్ల గురుకులంలో..
సుదిమళ్ల గురుకుల బాలికల పాఠశాలలో 83 మందికి 82 మంది ఉత్తీర్ణులై 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అరుణ కుమారి తెలిపారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు...
ఇల్లెందులో 15 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 21ఫిట్ హైస్కూల్ నూరుశాతం ఇతర పాఠశాలలు 99శాతం వరకు ఉత్తీర్ణతను సాధించాయి. అన్నీ పాఠశాలలకు 9 నుంచి 9.8 జీపీఏల వరకు సాధించాయి. 776 మంది పరీక్షలకు హజరు కాగా 688 మంది ఉత్తీర్ణులయ్యారు. 88.7 శాతం ఉత్తీర్ణత సాధించారు.


కాకతీయ హైస్కూల్‌లో 10 జీపీఏ సాధించిన శ్రీహిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్


మాంటిస్సోరిలో విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నెడుంతుండం, డైరెక్టర్లు

10జీపీఏ సాధించిన మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు


జీ.ప్రహర్ష | బి.శ్రీకర్ | ఎన్.కోమ | ఎస్ శ్రీవర్ధన్ | ఏ.మనస్వినీ | వై.అర్చన

రాణించిన మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు..
మాంటిస్సోరి పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏతో రాణించారు. ఇద్దరు 9.8, నలుగురు 9.7, 11 మంది 9.5, 15 మంది 9.3, 20 మంది 9.2, 74 మంది 9 జీపీఏతో ఉత్తీర్ణులయ్యారు. మార్గదర్శిని ఇంగ్లిష్ మీడియంలో 9.8 – 9 జీపీఏ వరకు 14 మంది సాధించినట్లు ప్రిన్సిపాల్ అర్వపల్లి రాధాకృష్ణ తెలిపారు.

కాకతీయ హైస్కూల్‌లో 27 మందికి 27 మంది, జవహర్ హైస్కూల్‌లో 22 మందికి 22 మంది, సరస్వతీ హైస్కూల్‌లో 16 మందికి 15 మంది, విశ్వశాంతిలో 25 మందికి 24 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రియదర్శినిలో 33 మందికి 32 మంది, ఎంఆర్‌జీ నారాయణ స్కూల్‌లో 16 మందికి 14 మంది, మాస్టర్ మైండ్‌లో 31 మందికి 30 మంది, మార్గదర్శిని ఇందిరానగర్‌లో 37 మందికి 36 మంది ఉత్తీర్ణులయ్యారు.

గురుకులాల్లో పెరిగిన ఉత్తీర్ణత


వందశాతం ఉత్తీర్ణత సాధించిన కిన్నెరసాని గురుకుల పాఠశాల విద్యార్థులు

పాల్వంచరూరల్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్‌లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం వందశాతం లక్ష్యం నెరవేర లేదు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించారు. కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని 24 ప్రభుత్వ హైస్కూల్‌లో 1400 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1156 మంది ఉత్తీర్ణులై 82.57 ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. నాగారం హైస్కూల్లో 22మందికి 14 మంది ఉత్తీర్ణులయ్యారు. 8 మంది ఫెయిలై 63 శాతం, జగన్నాథపురం హైస్కూల్‌లో 37మందికి 22 మంది పాసై 15 మంది ఫెయిలయ్యారు. 59 శాతం ఉత్తీర్ణత సాధించారు. యానంబైల్ హైస్కూల్‌లో 20 మంది పరీక్ష రాయగా 18 మంది ఉత్తీర్ణులై 90 శాతం ఉత్తీర్ణత, పాండురంగాపురం హైస్కూల్‌లో 44 మందికి 33 మంది పాసై 11 ఫెయిలయ్యారు. 75 శాతం ఉత్తీర్ణత సాధించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో...
ఐటీడీఏ పీఓ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యాన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సాధించలేకపోయారు. కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 53 మందికి 48మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదుగురు ఫెయిలై 91శాతం ఉత్తీర్ణత సాధించింది. ఉల్వనూరులోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 54 మందికి 52 మంది ఉత్తీర్ణలయ్యారు. 96.29 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సాంఘిక సంక్షేమ గురుకులంలో..
లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో 75మంది విద్యార్థులు పరీక్ష రాయగా 69మంది ఉత్తీర్ణలయ్యారు. గతేడాది 78 శాతం, ఈ ఏడాది 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల (భద్రాచలం)లో 70 మందికి 64మంది పాసై 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాఘింక సంక్షేమ బాలికల (పాల్వంచ) పాఠశాలలో 78 మందికి 76 మంది పాసై 97శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 95శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కిన్నెరసాని గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత...
కిన్నెరసానిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 78 మంది పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఓంకార్ హర్షిత్ 9.2 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

మండలంలో 91.93 శాతం ఉత్తీర్ణత


సాయిరజిని 9.7 జీపీఏ | శ్రావణి 9.5 జీపీఏ | వెన్నెల 9.5 జీపీఏ

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో 91.93 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 347 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 319 మంది ఉత్తీర్ణత సాధించారు. 21పిట్ ఉన్నత పాఠశాల ఒక్కటే నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం పది మంది పరీక్షకు హాజరుకాగా అందరూ పాసయ్యారు.

అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలకు ఇవ్వాలని సింగరేణి డైరెక్టర్(పా)ను 12 సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. మెజారిటీ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల నిబంధనావళి ప్రకారమే గుర్తింపు కాలపరిమితి ఇవ్వాలని కోరారు. గుర్తింపు సంఘానికి గుర్తింపు ఇచ్చేంత వరకు అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని సింగరేణి సీఎండీ, డీవైసీఎల్సీ హైదరాబాద్, జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)లకు అందజేయటం జరిగిందన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సుజాతనగర్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా మంగళవారం సుజాతనగర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో తహసీల్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా నాయకులగూడెం వరకు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకు పోలీసుల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు, చుంచుపల్లి సీఐలు ఇంద్రసేనారెడ్డి, రాయల వెంకటేశ్వర్లు, సీఆర్‌పీఎఫ్ సీఐ జీఎస్ రాజు, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు ఎస్సైలు జుబేదా బేగం, సీహెచ్ చంద్రశేఖర్, జీవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలవిజ్ఞాన మేళా

పాల్వంచ: జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియాలోని స్టార్ చిల్డ్రన్ స్కూల్‌లో మే 3వ తేదీ నుంచి 5వరకు ఉచిత విజ్ఞాన మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులకు ఉదయం 8.30 గంటల నుంచి 11 వరకు మూడు రోజులు ఫన్ మాథ్యమెటిక్స్, ఆర్ట్ అండ్ డ్రాయింగ్, కిచెన్ కెమిస్ట్రీ, స్టోరీ టెల్లింగ్ అంశాల్లో ఉచిత శిక్షణ నిర్వహించబడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9346787949, 9701898035 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

పాల్వంచరూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. రేగులగూడెం, మల్లారం, ఉల్వనూరు, మందేరకలపాడు, సత్యనారాయణపురం, కారెగట్టు, ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, సూరారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను, పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. మాట్లాడుతూ... మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బొగ్గ నారాయణ, కార్యదర్శులు రాజు, రమేష్, ప్రభాకర్, రణధీర్, సతీష్, మంగ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.